క్లుప్తంగా

టోర్నమెంట్‌లో నైపుణ్యం ప్రదర్శించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకట్రావ్

భద్రాచలంటౌన్: క్రీడాకారులు ఆటల్లో తమ నైపుణ్య సామర్థ్యాలను ప్రదర్శించేందుకు టోర్నమెంట్‌లను వేదికగా చేసుకొని గుర్తింపు పొందాలని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావ్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో 29వ నెహ్రూ కప్ తాళ్ళూరి భారతీదేవి స్మారక అంతర్రాష్ట్ర క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. భద్రాచలం ఏజెన్సీ ప్రాంతంలో ఇంత పెద్ద టోర్నమెంట్‌ను 29 ఏళ్లుగా నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ ప్రాంత యువత క్రీడాల్లో రాణించేందుకు నెహ్రూ కప్ క్రికెట్ టోర్నమెంట్‌కు ప్రభుత్వ గుర్తింపు లభించే విధంగా కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాకాల దుర్గాప్రసాద్, వల్లూరి వంశీ కృష్ణ, అజీమ్, బాలయోగి, సురేష్‌బాబు, హరిచంద్ర నాయక్, శ్రీనివాస్, రామకృష్ణ, భూపతిరావు, రంగారెడ్డి, వెంకటరెడ్డి, శ్రీధర్, శ్రీనివాసరాజు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దశదిన కర్మలకు హాజరు..

దుమ్ముగూడెం: మండలంలోని రేగుబల్లి గ్రామానికి చెందిన సకినాల దేవకృపాలు దశదిన కర్మలకు భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ఆదివారం హాజరయ్యారు. సకినాల దేవకృపాలు గత కొన్ని రోజుల క్రితం మృతి చెందారు. కాగా దవదిన కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన వెంట మాజీ జెడ్పీటీసీ అన్నెం సత్యనారాయణ మూర్తి, నాయకులు మోతుకూరి శ్రీకాంత్, ఖాదర్, జెట్టి రామకృష్ణ, కొయ్యలముడి సాగర్, పిట్టా పూర్ణయ్య, రాయపూడి శ్రవణ్, రాయపూడి అనిల్, రాయపూడి పుష్పరాజు, రాయపూడి రాజు, పొంది ముత్యయ్య, తాళ్ల ముత్యాలు, జెఏసీ అధ్యక్షుడు ఏసురత్నం తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ములకలపల్లి: మండలపరిధిలోని జగన్నాథపురం సబ్‌స్టేషన్ పరిధిలో నేడు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ నరేశ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లోని విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకూ కరెంట్ కోత విధించనున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

బర్తరఫ్ చేయాలి

దమ్మపేట: భారత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించేలా, కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ.. మండలంలోని నాచారంలో సీపీఎం, కాంగ్రెస్ పార్టీల గ్రామ శాఖల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఆదివారం నాచారంలో అమిత్ షా వ్యాఖ్యలను తప్పుబడుతూ.. సీపీఎం, కాంగ్రెస్ పార్టీల ఆధ్వర్యంలో ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... అంబేడ్కర్‌ను అవమానించేలా మాట్లాడిన అమిత్ షాను, మంత్రి వర్గం నుండి వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. స్వాతంత్ర్య కాలం నాటి నాయకులను విమర్శించడం బీజేపీకి తగునా అని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు యంద్రాతి అప్పారావు, పిల్లి నాయుడు, కాంగ్రెస్ నాయకులు చీకటి శ్రీనివాసరావు, యర్రగొర్ల రాధకృష్ణ, ఎల్లిన మురళీ, వేపకుంట్ల వెంకమ్మ తదితరులు పాల్గొన్నారు.

వీధిలైట్లపై శ్రద్ధ చూపాలి

అశ్వాపురం: మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామ పంచాయతీ అధికారులకు ఇంటి పన్నులు కట్టించుకునే దానిపై ఉన్న శ్రద్ధ.. గ్రామంలో వీధిలైట్ల విషయంలో చూపాలని సీపీఎం పార్టీ గ్రామ శాఖ కార్యదర్శి దండి రాములు అన్నారు. మల్లెలమడుగులో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గ్రామంలో వీధిలైట్లు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పంచాయతీ కార్యదర్శి స్పందించి కొత్త సంవత్సరం వరకైనా వీధిలైట్లు వేయించాలని ఆయన కోరారు. గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల సర్వే నత్తనడకన సాగుతోందని, సర్వే వేగవంతం చేయాలని అన్నారు. 50 ఏళ్లుగా గ్రామంలో నివసిస్తున్న ప్రజలందరికీ ఇళ్ల సర్వే చేయాలని కోరారు.

ఆలయాల్లో పూజలు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వినాయకపురం గ్రామంలోగల చిలకలగండీ ముత్యాలమ్మ తల్లి ఆలయంలో ఆదివారం భక్తులు పూజలు చేశారు. ఉదయం నుంచే వివిధ ప్రాంతాల నుంచి భక్తులకు ఆలయానికి చేరుకొని అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. అలాగే అమ్మవారికి మొక్కుబడులు చెల్లించుకుని, అన్నసమారాధన కార్యక్రమాలను నిర్వహించారు. దీంతో ఆలయ పరిసరాల్లో భక్తుల సందడి నెలకొంది.

'కుట్టుమిషన్లు' స్వాహా!

- మాయమైన 18 మిషన్లు
- మైనార్టీ మహిళల కోసం పంపిణీ చేసిన గత ప్రభుత్వం
- ఎంపీడీఓల హస్తం ఉందా.?



ఎంపీడీఓ కార్యాలయంలో భద్రపరిచిన కుట్టుమిషన్లు (ఫైల్)

అశ్వారావుపేటరూరల్: నిరుపేద మైనార్టీ మహిళల కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల ముందు ఉచిత కుట్టుమిషన్ పథకాన్ని ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. ప్రతి నియోజకవర్గానికి వంద కుట్టు మిషన్లను మంజూరు చేసి, ఆయా మిషన్లను ఎంపీడీఓలకు అందజేసింది. దీంట్లో భాగంగానే అశ్వారావుపేట నియోజకవర్గానికి కుడా లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు వంద కుట్టుమిషన్లను మంజూరు చేయగా, ఆయా కుట్టుమిషన్లను మైనారిటీ కార్పొరేషన్ ద్వారా స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో భద్రపరిచారు. వీటిని గతేడాది జూలై నాటికే అందుబాటులోకి తీసుకురాగా, అసెంబ్లీ, ఎంపీ ఎన్నికల నేపథ్యంలో పంపిణీకి నోచుకోలేదు. ఆ తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగా, బీఆర్ఎస్ ప్రభుత్వం అందించిన కుట్టుమిషన్ల పథకానికి బ్రేక్ వేసింది. దీంతో ఆ నాటి నుంచి కుట్టుమిషన్లు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోనే మూలుగుతున్నాయి. కాగా, ఇదే అదునుగా తీసుకున్న గుర్తు తెలియని వ్యక్తులు ఎంపీడీఓ కార్యాలయంలో భద్రపరిచిన వంద కుట్టు మిషన్లలో దాదాపు 18 మిషన్లు స్వాహా చేసిన వ్యవహారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కార్యాలయం నుంచి మాయం చేసిన కుట్టు మిషన్ల విలువ ఒక్కొక్కటి 10 వేలు చొప్పున రూ.లక్షా 80వేలు ఉంటాయని అంచనా. కొద్ది రోజుల క్రితం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీఓ గదిలో అడ్డుగా ఉన్న ఈ కుట్టు మిషన్లను ఖాళీగా ఉన్న ఎంపీపీ గదిలోకి మార్చారు. ఈ క్రమంలోనే కుట్టు మిషన్లు ఉండాల్సిన వాటి కంటే తక్కువగా ఉండటాన్ని గుర్తించినట్లు తెలిసింది. అయితే ఈ విషయాన్ని బయటకు రాకుండా అధికారులు, సిబ్బంది జాగ్రత్త పడుతున్నారు. కాగా, ఈ కుట్టు మిషన్లు కార్యాలయానికి చేరిన తర్వాత స్థానికంగా ఓ ఎంపీడీఓ ఉద్యోగ విరమణ చేయగా, మరో ఎంపీడీఓ బదిలీపై వెళ్లారు. ఎంపీడీవోల బదిలీల సమయంలో కుట్టు మిషన్లు మాయం చేశారా? లేక ఆయా అధికారుల 'హస్తం' ఉందా? అసలు ఎన్ని కుట్టు మిషన్లు మాయం చేశారనే విషయాలు ఉన్నతాధికారులు పూర్తి స్థాయిలో విచారణ చేస్తే కానీ వెల్లడికావు.

మిషన్లు తక్కువ ఉన్నట్లు గుర్తించాం..

మైనారిటీ కార్పొరేషన్ ద్వారా ఎంపీడీఓ కార్యాలయానికి వంద కుట్టు మిషన్లు అందించినట్లు సమాచారం ఉంది. కానీ వాటిలో కొన్ని మిషన్లు తగ్గినట్లు గుర్తించాం. ఎంపీఓ గదిలో అడ్డుగా ఉన్న కుట్టుమిషన్లను ఖాళీగా ఉన్న ఎంపీపీ గదిలోకి మార్చే సమయంలో కొన్ని తగ్గినట్లు గుర్తించాం. అయితే ఎన్ని కుట్టుమిషన్లు తగ్గింది, తెలియదని వివరాలు సేకరించి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తాం.

– ప్రవీణ్ కుమార్, ఎంపీడీఓ, అశ్వారావుపేట

నిబంధనలు తప్పక పాటించాలి



సమావేశంలో పాల్గొన్న టీజేఎస్ నాయకులు

దుమ్ముగూడెం: 5, 6వ షెడ్యూల్లలో పొందుపరిచిన అంశాలను అధికారులు తప్పక పాటించాలని, వలస ఆదివాసులకు కులధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని తెలంగాణ జన సమితి ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్‌చార్జ్ గోపగాని శంకరరావు డిమాండ్ చేశారు. ఆదివారం దుమ్ముగూడెంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతంలో పెసా, వాల్టా చట్టాలు అమలు కావడం లేదన్నారు. ఛత్తీస్‌గఢ్ నుంచి 50 ఏళ్ల క్రితం వలస వచ్చిన ఆదివాసులకు 2021 వరకు కులధ్రువీకరణ పత్రాలు ఇచ్చి తరువాత నుంచి ఇవ్వకపోవడంతో ఎంతో మంది గిరిజనులు చదువుకు దూరమవుతున్నారని తెలిపారు. ఈ సమస్యను టీజేఎస్ వ్యవస్థాపకుడు ఎమ్మెల్సీ కోదండరాం ద్వారా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్లడం జరిగిందన్నారు. ఏజెన్సీలో గిరిజన సమస్యల పరిష్కారానికి టీజేఎస్ పార్టీ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ జన సమితి భద్రాద్రి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బరగడి దేవదానం, పగడాల కరుణకర్ రెడ్డి, పినపాక నియోజకవర్గ ఇన్‌చార్జ్, మూల నాగిరెడ్డి, భద్రాచలం నియోజకవర్గ కన్వీనర్ రేపాక రామారావు, రఘునాథపాలెం మండల కో ఆర్డినేటర్ ఉన్నం సతిష్ కుమార్, వలస ఆదివాసుల జిల్లా కన్వీనల్ మడాకు చాదు తదితరులు పాల్గొన్నారు.

అలంకారప్రాయంగా ఎల్‌సీడీ టీవీ

అశ్వారావుపేటరూరల్: చిన్నారులకు విజ్ఞానం, వినోదాన్ని అందించే ఉద్దేశంతో అంగన్‌వాడీ కేంద్రానికి అందించిన ఎల్‌సీడీ టీవీ గోడకు అలంకారప్రాయంగా మారింది. వివరాలిలా ఉన్నాయి. అశ్వారావుపేట మండలంలోని మారుమూల అటవీ ప్రాంతంలోగల చెన్నాపురం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రానికి ఏడాది క్రితం ప్రభుత్వం 32అంగుళాల ఎల్‌సీడీ టీవీ అందించింది. అయితే ఈ కేంద్రానికి విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో ఈ ఎల్‌సీడీ టీవీ ఏడాదిగా నిరుపయోగంగా ఉంది. కేంద్రానికి విద్యుత్ సౌకర్యాన్ని కల్పించడంలో నిర్లక్ష్యం చేయడంతో ఎల్‌సీడీ టీవీ అందించిన ఉద్దేశం నెరవేరడం లేదు. ఇప్పటికైనా కేంద్రానికి విద్యుత్ సౌకర్యాన్ని కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

బూర్గంపాడు: పారిశుద్ధ్య కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వారికి సముచిత గౌరవం, వేతనం అందించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ నాయకులు డి.పున్నంచంద్ డిమాండ్ చేశారు. బూర్గంపాడులో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పల్లెలు, పట్టణాలను పరిశుభ్రంగా ఉంచటంలో కీలకంగా పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతనాలు అందటం లేదన్నారు. పారిశుద్ధ్య కార్మికులు వారి ఆరోగ్యాన్ని పణంగా పెట్టి ప్రజారోగ్యం కోసం పాటుపడుతున్న నిజమైన సేవకులని, వారి శ్రమకు తగినవిధంగా కనీసం నెలకు రూ 45వేల వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు వెంకన్న, మహబూబ్, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

నిలిచిపోయిన రోడ్డు పనులు

అశ్వారావుపేటరూరల్: ఐటీడీఏ నిధులతో మంజూరైన బీటీ రహదారులకు బిల్లుల చెల్లింపులు ఇవ్వడం లేదని, కోట్లాది రూపాయాల వ్యయంతో చేపట్టిన బీటీ రహదారుల నిర్మాణాలను కాంట్రాక్టర్లు అంపూర్తిగా నిలిపివేశారు. రోడ్ల నిర్మాణాల పూర్తి చేయడంలో కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యంగా మారగా, గడిచిన ఏడాది కాలంగా ఆయా రోడ్ల పనులు నిలిచిపోగా పట్టించుకునే వారే లేకుండా పోయారు. వివరాలిలా ఉన్నాయి. అశ్వారావుపేట మండలం దిబ్బగూడెం(రామన్నగూడెం) నుంచి తాటి నాగుల గుంపు గ్రామానికి, నందిపాడు గ్రామం కారంవారి గుంపు గ్రామానికి, మల్లాయిగూడెం-జగన్నాథపురం గ్రామానికి, మల్లాయిగూడెం-భీల్లుడుగూడేనికి ఒకే ప్యాకేజీ కింద సుమారు రూ.4కోట్ల8లక్షల రూపాయాలు కేటాయించారు. ఆయా గ్రామాల్లో ఈ నిధులతో మొత్తం 7.8 కిలో మీటర్ల మేర బీటీ రహదారులను నిర్మించేందుకు ఐటీడీఏ ద్వారా గతేడాది నవంబర్‌లో నిధులు మంజూరు చేసింది. మట్టి, మోటల్ రోడ్లుగా ఉన్న ఆ మార్గాలను బీటీ రోడ్లు నిర్మించేందుకు నిధులు కేటాయించగా, ఆయా పనులను కాంట్రాక్టర్లు టెండర్ ప్రక్రియ ద్వారా ఇద్దరు కాంట్రాక్టర్లు దక్కించుకున్నారు. ఈ పనులను అదే నెలలో అప్పటి ఎంపీ నామా నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు చేతుల మీదుగా ఆర్భాటంగా పనులను ప్రారంభించారు. అనంతరం ఆయా కాంట్రాక్టర్లు రోడ్ల నిర్మాణాల పనులను ప్రారంభించి ఎర్త్ వర్క్‌లను పూర్తి చేసి, వెట్ మిక్స్ వేశారు. ఆ తర్వాత తారు వేసి రోడ్ల నిర్మాణాలను పూర్తి చేయాల్సి ఉంది. కానీ బిల్లులను సాకుగా చూపించి పనులను నిలిపివేశారు. తొలి విడత బిల్లుల రాలేదని, గతేడాది డిసెంబర్‌లో రోడ్ల నిర్మాణాలను పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు అసంపూర్తిగా వదిలేశారు. దీంతో ఏడాది దాటుతున్న నేటికి ఈ రోడ్ల పనులను ఆయా కాంట్రాక్టర్లు పూర్తి చేయకుండా వదిలేయడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోవడంతో ఆయా మార్గాల్లో వేసిన వెట్ మిక్స్ కంకర రాళ్లు పైకి లేచి, దుమ్ము లేస్తోంది. దాంతో ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించే ప్రయాణీకులు, వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తాం: ఏఈ

అసంపూర్తిగా ఉన్న రహదారులకు బిల్లుల చెల్లింపులు కాలేదని, కాంట్రాక్టర్లు పనులు నిలిపివేసిన మాట వాస్తవమేనని ఐటీడీఏ అశ్వారావుపేట ఏఈ ప్రసాద్ అన్నారు. తొలి విడత బిల్లులను సిద్ధం చేసి సమర్పించామని, కానీ సకాలంలో పనులు చేయకపోవడంతో బిల్లుల చెల్లింపులు నిలిచిపోయి ఉండొచ్చని తెలిపారు. ఆయా బీటీ రహదారుల నిర్మాణాలు పూర్తి చేస్తేనే కాంట్రాక్టర్లకు పూర్తిస్థాయిలో బిల్లులను చెల్లిస్తామన్నారు. త్వరలోనే అసంపూర్తి నిర్మాణాలపై ఉన్నతాధికారులకు నివేదిక సమర్పిస్తామని చెప్పారు.



దిబ్బగూడెం- తాటి నాగులగుంపు మార్గంలో అసంపూర్తిగా వదిలేసిన రోడ్డు



నందిపాడు-కారంవారిగుంపు మార్గంలో కంకరతేలి ఉన్న రోడ్డు

క్యాలెండర్లు ఆవిష్కరణ

భద్రాచలంటౌన్: భద్రాచలం డివిజన్ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ 2025 క్యాలెండర్, డైరీని ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావ్ ఆదివారం క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడు వెంట ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు బందు వెంకటేశ్వరరావు, కేఎస్ఎల్‌వీ ప్రసాద్, కృష్ణమూర్తి, సత్యనారాయణ, సుబ్బయ్యచౌదరి, రాజబాబు, రామ్మోహన్‌రావు, ఐలయ్య, రాజు, అక్కయ్య, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

బీటీపీఎస్ కాంట్రాక్ట్ కార్మికుల సమ్మె

మణుగూరురూరల్: పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మణుగూరు భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్(బీటీపీఎస్) కాంట్రాక్ట్ కార్మికులు నేటి నుండి సమ్మె బాట పట్టనున్నారు. ఆదివారం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. గత నాలుగు నెలలుగా తమకు వేతనాలు చెల్లించడం లేదని, తద్వారా కుటుంబ పోషణ భారమై అప్పులు పాలవుతూ అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. బిల్లులు రాక కాంట్రాక్టర్లు సైతం తమకు జీతాలు చెల్లించలేని పరిస్థితి నెలకొందన్నారు. సంబంధిత జెన్‌కో అధికారులు స్పందించి తమకు పెండింగ్ వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కాంట్రాక్ట్ కార్మికులు డిమాండ్ చేశారు. తమకు వేతనాలు చెల్లించేంత వరకు సమ్మెతో నిరసన తెలుపుతామన్నారు.

సమ్మెతో విద్యార్థులు ఇంటిబాట

గుండాల: వెట్టి చాకిరితో..చాలీ చాలని వేతనాలతో చేస్తున్న తమను రెగ్యులర్ చేయాలని ఎస్ఎస్ఏ ఉద్యోగులు గత కొంత కాలంగా సమ్మె బాటలో ఉండగా..విద్యార్థులు ఇంటి బాట పట్టగా పాఠశాల మూత పడింది. దీంతో తమ పిల్లల చదువులు ఏం కావాలని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత 20 రోజులుగా సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ కార్యాలయాల ముందు బైఠాయించారు. ఆళ్లపల్లి మండలంలోని అనంతోగు కేజీబీవీ విద్యాలయం ఆదివారం నాటికి విద్యార్థులు లేక మూత పడింది. ఇంతకాలం బోధన లేక వేచి చూసిన విద్యార్థులు చివరికి తిండి పెట్టే వారు కూడా లేకపోవడంతో ఒక్కరొక్కరుగా ఇంటిబాట పట్టారు. ఇదివరకే కాంట్రాక్టు ఉద్యోగులు సమ్మె చేస్తుండగా ప్రస్తుతం వంట చేస్తున్న సిబ్బంది సైతం సమ్మెలో దిగారు. దీంతో చేసేది లేక విద్యార్థులను తల్లిదండ్రులు వారివారి పిల్లలను ఇళ్లకు తీసుకెళ్తున్నారు. 20 రోజులుగా సమ్మె చేస్తున్న ఉద్యోగులను పట్టించుకోని ప్రభుత్వం కనీసం ప్రత్యామ్నాయ ఉపాధ్యాయులను కూడా నియమించలేక పోతుందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము వ్యవసాయ పనులకు వెళ్తూ పిల్లల భవిష్యత్ కోసం హాస్టళ్లలో వదిలేస్తే పాలకులు ఉద్యోగుల సమస్యలను గాలికి వదిలేస్తుందని వాపోతున్నారు. తమ పిల్లల భవిష్యత్ ఏమి కావాలని ప్రశ్నిస్తున్నారు. ఎన్నికల ముందు ప్రభుత్వం ఇచ్చిన హామీని పరిష్కరించకపోవడంతో ఉద్యోగులు విధుల్లో చేరే పరిస్థితి లేదని పిల్లలు చదువుకు దూరమవుతున్నారని అంటున్నారు. అయితే అనంతోగు కేజీబీవీ పాఠశాల విద్యార్థులు ఇంటి పట్టగా పాఠశాల మూత పడింది. గుండాల పాఠశాల విద్యార్థులు సైతం ఒక్కొక్కరుగా ఇంటి బాట పడుతున్నారు. దీంతో ఏజెన్సీలో విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారవుతుందని పలువురు వాపోతున్నారు. పాలకులు స్పందించి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించి, విద్యార్థుల చదువులకు ఆటంకం లేకుండా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.



విద్యార్థులు లేక మూతబడిన అనంతోగు కస్తూర్బా పాఠశాల

జనాభా ప్రాతిపదికన అవకాశాలివ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న సామల ప్రవీణ్

చర్ల: దేశంలో జనాభా ప్రాతిపదికన రాజకీయ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా బీఎస్పీ ముందుకెళ్తుందని ఆ పార్టీ భద్రాచలం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి సామల ప్రవీణ్ అన్నారు. ఆదివారం చర్లలో పార్టీ మండల అధ్యక్షుడు చల్లగుండ్ల సతీష్ చౌదరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మత మైనారటీలతో పాటు అన్నీ వర్గాల ప్రజలకు సమన్యాయం చేసే పార్టీలలో ఏకైక పార్టీ బీఎస్పీనేనని ఆయన అన్నారు. బహుజనులకు రాజ్యాధికారం దక్కేంత వరకు ఉద్యమం కొనసాగుతుందని ఆయన అన్నారు. ఈ సమావేశంలో ఇటీవల బీఎస్పీలో చేసిన కొండా కౌశిక్‌ను పార్టీ మండల ప్రధాన కార్యదర్శిగా నియమించినట్లు ఆయన ప్రకటించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నీలి ప్రకాష్‌కు జాతీయ సేవా నంది అవార్డు



సంస్థ ప్రతినిధుల నుంచి అవార్డు అందుకుంటున్న నీలి ప్రకాష్

చర్ల: ఏజెన్సీ ప్రాంతంలో సేవా కార్యక్రమాలను కొనసాగిస్తూ ఆపదలో ఉన్న పలువురికి ఆపన్న హస్తం అందిస్తున్న చర్ల వాసి లయన్ నీలి ప్రకాష్‌కు బెస్ట్ సేవా నంది నేషనల్ అవార్డు 2024తో పాటు గౌరవ డాక్టరేట్ అవార్డు అందింది. గుడ్ సమారిటన్ థియోలాజికల్ సెమినరీ యూనివర్సిటీ, మనం ఫౌండేషన్ ఇంటర్నేషనల్ వారు శనివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యూనివర్సిటీ ప్రతినిధులు నీలి ప్రకాష్‌కు వాటిని అందించారు. 2002వ సంవత్సరంలో మండలంలోని ఓ మారుమూల గ్రామాన్ని దత్తత తీసుకొని అక్కడి నుంచి సేవా కార్యాక్రమాలను శ్రీకారం చుట్టిన నీలి ప్రకాష్ 2024 వరకు 925 సేవా కార్యక్రమాలను కొనసాగించారు. ఈ క్రమంలో వైద్యం, జీవనభృతి, క్రీడలు, నిత్యావసరాల పంపిణీ, పేదలకు గృహోపకరణాలు, వంట సామాగ్రి అందజేత, వరద బాధితులకు సహాయ సహకారాల అందజేత వంటి కార్యక్రమాలతో పాటు కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ కరోనా మృతులకు దహన సంస్కారాల వంటి కార్యాక్రమాలను కూడా కొనసాగించారు. దీంతో హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రముఖ జ్యోతిష్య పండితులు దైవజ్ఞ శర్మ, మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే సముద్రాల వేణుగోపాలాచారి మరియు సంస్థ ప్రతినిధుల చేతుల మీదుగా చర్లకు చెందిన లయన్ నీలి ప్రకాష్‌కు ఈ అరుదైన పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా నీలి నందును పలువురు అభినందిస్తున్నారు.

తహసీల్‌కు నూతన హంగులు

- కొత్త ఫర్నిచర్, సీసీ కెమెరాల ఏర్పాటు
- ప్రజలు కూర్చునేందుకు సిమెంట్ గద్దెల నిర్మాణం



నూతనంగా అధునీకీకరించిన మెజిస్ట్రేట్ చాంబర్



కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కూర్చునే బల్లలు



గతంలో తహసీల్దార్ కార్యాలయం ఇలా..




నేడు నూతన రంగులతో కళకళలాడుతూ ఇలా..

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం మండల తహసీల్దార్ కార్యాలయం గతంలో ఎప్పుడు ఏ వైపు నుంచి కూలి పడుతుందో అనే విధంగా ఉండేది. పై నుంచి స్లాబ్ పెచ్చులు ఊడి పడతాయేమో అనే భయంతో కార్యాలయ సిబ్బంది, ఇక్కడికి వచ్చే ప్రజలు భయం భయంగా సంచరించేవారు. అయినప్పటికీ ఎంతమంది తహసీల్దార్‌లు వచ్చిన తమ పని తాము చూసుకొని వెళ్లేవారు తప్ప కార్యాలయ మరమ్మతులను పట్టించుకోలేదు.

ఈ నేపథ్యంలో గత కొన్ని నెలల క్రితం తహసీల్దారుగా బాధ్యతలు చేపట్టిన అశోక్ కుమార్ కార్యాలయ ఆధునీకరణపై దష్టి పెట్టారు. దీనిలో భాగంగా కార్యాలయంలో అపరిశుభ్రంగా ఉన్న పరిసరాలను ముందస్తుగా శుభ్రం చేయించారు. అనంతరం కార్యాలయ స్లాబు పెచ్చులు ఊడకుండా మరమ్మతు పనులు, మరుగుదొడ్ల ఆధునీకరణ చేపట్టారు. ప్రజలు కూర్చునేందుకు వీలుగా కార్యాలయ ప్రాంగణంలో చెట్ల చుట్టూ దిమ్మలను కట్టించి ప్రజలు సేద తీరేందుకు అనువుగా తయారు చేశారు. అలాగే కార్యాలయ ఆవరణలో ఖాళీగా ఉన్న ప్రదేశంలో ఫ్లోరింగ్ చేయించి పైన రేకులు వేయించి గ్రీవెన్స్ డేకు అనుకూలంగా తయారు చేయించారు. కార్యాలయంలో నూతనంగా మెజిస్ట్రేట్ చాంబర్‌ను అత్యాధునికంగా తయారు చేసి నూతన ఫర్నిచర్ ఏర్పాటు చేసి కార్యానికి వచ్చే ప్రజాప్రతినిధులు, ప్రజలు ఇతర అధికారులు కూర్చునే విధంగా అందంగా అలంకరించారు. కార్యాలయంలో దేశ, రాష్ట్ర సాధనలో అశువులు బాసిన నేతల ఫోటోలను ఏర్పాటు చేసి ఉంచారు. కార్యాలయంలో సీలింగ్ ఏర్పాటు చేసి కార్యాలయానికి నూతనంగా రంగులు వేయించారు అలాగే కార్యాలయానికి సంబంధించి పెయింటర్‌తో సంబంధిత సెక్షన్లకు సంబంధించి నేమ్ బోర్డులను తయారు చేయించారు. ఒకప్పుడు కార్యాలయంలో పది నిమిషాలు ఉందామంటేనే భయపడే ప్రజలు ఆధునికరించిన ప్రస్తుత కార్యాలయంలో ఎటువంటి భయం లేకుండా సమయం గడుపుతున్నారు.

తహసీల్దార్ అశోక్ కుమార్ సిబ్బంది సహకారంతో రికార్డుల నిర్వహణ గదిని ప్రత్యేకంగా ఏర్పాటు చేసి ఉంచారు. కార్యాలయంలోని గదులకు తలుపులు, కిటికీలను ఏర్పాటు చేసి ప్రతి గదికీ విద్యుత్ కనెక్షన్‌ను ఏర్పాటు చేశారు. కార్యాలయంలో సీసీ కెమెరాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసి సిబ్బంది పనితీరును నిత్యం పరిశీలిస్తున్నారు. కార్యాలయానికి వచ్చే ప్రజల పట్ల సిబ్బంది వ్యవహారశైలిని నిత్యం పరిశీలన చేస్తూ కార్యాకలపాలు సాగిస్తున్నారు. కార్యాలయ మరమ్మతు పనులకు సంబంధించి సిబ్బందితో పాటు కొంత మంది దాతల సహకారం అందించారు.

సిబ్బంది సహకారంతో పనులు..



తహసీల్దార్‌గా బదిలీపై ఇక్కడికి రావడంతోనే కార్యాలయం పరిస్థితి చూసి చలించిపోవాల్సి వచ్చింది. వెంటనే సిబ్బంది సహకారంతో పాటు దాతల సహకారంతో కార్యాలయ మరమ్మతు పనులను చేపట్టి యుద్ధ ప్రతిపధికన పూర్తి చేశాం. కార్యాలయానికి వచ్చే ప్రజలకు మెరుగైన సేవలతో పాటు వారు కూర్చునేందుకు అనువుగా తగిన ఏర్పాట్లు చేశాం.

– అశోక్‌కుమార్, తహసీల్దార్